సీఎం కప్ పోటీలు ప్రారంభం


తాడ్వాయిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


గోపాల్‌పేటలో..


సదాశివనగర్‌లో..


పిట్లంలో ప్రారంభిస్తున్న ఎంపీపీ కవిత


గాంధారిలో ..

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలో సీఎం కప్ క్రీడా పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రీడాకారులను పరిచయం చేసుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు ఆరోగ్యాన్ని ఇవ్వడమే కాకుండా ఆహ్లాదాన్ని కూడా పంచుతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు మళ్లీ గెలవడానికి ప్రయత్నించాలని సూచించారు. మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని క్రీడాకారులకు సూచించారు. మొదటి రోజు క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.


నాగిరెడ్డిపేట: కబడ్డీ ఆడుతున్న బాలికలు


గండిమాసానిపేటలో.. జెడ్పీటీసీ ఉషాగౌడ్


దోమకొండలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రజాప్రతినిధులు


బాన్సువాడ పట్టణంలో క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు, అధికారులు


బిచ్కుందలో.. ఎంపీడీవో ఆనంద్


పెద్దకొడప్‌గల్‌లో..

క్రీడల ప్రారంభోత్సవాన్ని బహిష్కరించిన సర్పంచ్

భిక్కనూరు: మండల కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సోమవారం భిక్కనూరు సర్పంచ్ తున్కి వేణు బహిష్కరించారు. ప్రొటోకాల్ ప్రకారం మండల కేంద్రంలో ఎలాంటి ప్రభుత్వ కార్యక్రమం జరిగినా గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచ్ అధ్యక్షత వహించడంతో పాటు ముఖ్య పాత్ర పోషిస్తారు. ఇందుకు భిన్నంగా భిక్కనూరు మండల కేంద్రంలో పోటీల ప్రారంభోత్సవం జరిగింది. సర్పంచ్‌కు క్రీడల ప్రారంభోత్సవం గురించి ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో పాటు క్రీడలు జరిగే స్థలం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎంపీపీ గాలిరెడ్డి, జెడ్పీటీసీ పద్మనాగభూషణం గౌడ్‌ల ఫొటోలు మాత్రమే ప్రచురించారు. సర్పంచ్ ఫొటో, పేరు కూడా ఎక్కడా పెట్టలేదు. ఈ విషయమై అధికారులను అడుగగా వారి నుంచి సరైన జవాబు రాలేదు. దీంతో ఆయన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు.


భిక్కనూరులో సర్పంచ్ లేకుండా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

క్లుప్తంగా

పోలీస్ స్టేషన్‌కు సీసీ కెమెరాల వితరణ



గాంధారి(ఎల్లారెడ్డి): స్థానిక పోలీస్‌స్టేషన్‌కు మండల కేంద్రంలోని ఓ నర్సింగ్ హోం యాజమాన్యం సోమవారం నాలుగు సీసీ కెమెరాలను అందజేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగంగా ఉంటాయని, ప్రధాన కూడళ్ల వద్ద కచ్చితంగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్సై కోరారు.

సిద్ధరామేశ్వరుడికి అర కిలో వెండి పూలహారం



భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వరస్వామికి బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన మైపతి సిద్ధరాములు రూ.40 వేల విలువ చేసే అర కిలో వెండి పూల హారాన్ని సోమవారం బహూకరించారు. తన తల్లి జయలక్ష్మి కోరిక మేరకు స్వామి వారికి పూల హారాన్ని అందజేశానని సిద్ధరాములు తెలిపారు. ఈవో శ్రీధర్, ఆలయ పూజారి రాజేశ్వరశర్మ పాల్గొన్నారు.

ప్రైజ్‌మనీని విరాళమిచ్చిన బాలుడు



భిక్కనూరు: టాలెంట్ పరీక్షల్లో ప్రతిభ చూపి సాధించిన ప్రైజ్‌మనీని ఓ బాలుడు భిక్కనూరు రేణుకాదేవి ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి సోమవారం విరాళంగా అందజేశాడు. వివరాలు.. మండల కేంద్రంలోని చైతన్య విద్యానికేతన్‌లో 9వ తరగతి చదువుతున్న భూర్ల రుషికేశ్ 3 రోజుల క్రితం కామారెడ్డిలో మాథ్స్ ఫైండర్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాండ్ మాథ్స్ టాలెంట్ పరీక్షలో ప్రథమ స్థానం సాధించి రూ.5 వేలు బహుమతిగా పొందాడు. ఈ ప్రైజ్‌మనీని భిక్కనూరు రేణుకా దేవి ఎల్లమ్మ ఆలయం అభివృద్ధికి అందజేశాడు.

చెక్కుల పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్‌లో సోమవారం ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు చేతుల మీదుగా పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మహమ్మద్‌నగర్, బూర్గుల్, తున్కిపల్లి, గాలీపూర్ గ్రామాలకు చెందిన 8 మందికి చెక్కులు వచ్చాయని ఆయన తెలిపారు. గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, ఉప సర్పంచ్ రాములు నాయకులు అబ్దుల్, రామాగౌడ్, తదితరులు ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



మాచారెడ్డి: మండల కేంద్రంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఎంపీపీ నర్సింగ్‌రావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యం కోసం రోడ్డు విస్తరణ పనులను చేపట్టవలసి వచ్చిందన్నారు. స్థానికులు పనులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట దేవునిపల్లి సర్పంచ్ అరవింద్, నాయకులు నవీన్‌రెడ్డి, రాంమోహన్, తదితరులున్నారు.

పేకాడితే కఠిన చర్యలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పేకాడినా, బెట్టింగ్ పెట్టినా ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని, వారి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కోనారెడ్డి అన్నారు. పేకాట, బెట్టింగ్ చట్టరీత్యా నేరమని, వాటిని ఆడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎక్కడైనా ఎవరైనా పేకాట ఆడితే తమకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

లారీలను త్వరగా ఏర్పాటు చేయండి


ఎల్లారెడ్డి ఆర్డీవో శ్రీనుకు వినతిపత్రాన్ని అందిస్తున్న టీజేఎస్ నాయకులు

ఎల్లారెడ్డి: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద లారీలను ఏర్పాటు చేసి సకాలంలో తూకం వేసిన ధాన్యాన్ని రవాణా అయ్యేలా చర్యలు తీసుకోవాలని టీజేఎస్ నాయకులు నిజ్జన రమేశ్ అన్నారు. సోమవారం ఆర్డీవో శ్రీనుకు రైతులతో కలిసి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ.. ధాన్యం కాంటా కోసం నెల రోజుల నుంచి రైతులు పడిగాపులు కాస్తున్నారన్నారు. కాంటా అయిన ధాన్యం తరలింపులో సైతం లారీలు లేక జాప్యం జరుగుతోందని, తక్షణం లారీలను రప్పించి ధాన్యాన్ని తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

టాటూలు వేసుకుంటే 6 నెలల తర్వాతే రక్తదానం

కామారెడ్డి అర్బన్: ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం టాటూలు(పచ్చబొట్టు) వేసుకున్న వారు 6 నెలల తర్వాత రక్తదానం చేయవచ్చని ఐవీఎఫ్ సేవాదళ్ తెలంగాణ చైర్మన్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ బాలు అన్నారు. టాట్టూలు వేసుకుంటే అసలు రక్తదానం చేయడానికి పనికిరారని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రచారం వాస్తవం కాదని ఆయన అన్నారు. టాటూలతో అంటు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, యువత వాటిని వేయించుకోకపోవడమే మంచిదని అన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మద్నూర్(జుక్కల్): రైతుల కోసం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని రైతులు తక్కువ ధరకు అమ్ముకోవద్దని డోంగ్లీ సొసైటీ చైర్మన్ రాంపటేల్ పేర్కొన్నారు. సుల్తాన్‌పేట్‌లో సోమవారం వరి ధాన్యం కొనుగోళ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరి ధాన్యాన్ని ఆరబెట్టుకొని తగిన తేమ శాతం వచ్చిన తర్వాతే కొనుగోలు కేంద్రాలను తమ పంటను తీసుకురావాలని సూచించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బస్సీ పటేల్, శశాంక్ పటేల్, నాయకులు బాబు పటేల్ పాల్గొన్నారు.

ఇల్చిపూర్‌లో ..

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్‌లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం కౌన్సిలర్ గడ్డమీదిరాణి మహేష్‌లు ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర పొందాలని సూచించారు.


సుల్తాన్‌పేట్‌లో ప్రారంభిస్తున్న డోంగ్లీ సొసైటీ చైర్మన్ రాం పటేల్

ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని 10వ వార్డులోని వైశ్యభవన్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీకాంత్, నీలకంఠం, కమిషనర్ జగ్జీవన్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఉప్పల్‌వాయిలో..

రామారెడ్డి: ఉప్పల్‌వాయిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ కొత్తల గంగారం, రైతు కమిటీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగారం మాట్లాడుతూ.. అవసరమున్న వారందరికీ చికిత్స అందించి, కంటి అద్దాలు, మందులను ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

గాంధారి(ఎల్లారెడ్డి): నేరల్ తండాలో సోమవారం ఆరోగ్య ఉప కేంద్రం భవనానికి ఎంపీపీ రాధాబలరామ్ నాయక్, జెడ్పీటీసీ శంకర్ నాయక్, స్థానిక సర్పంచ్ కమోది బాయి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి రూ.20 లక్షల మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్, ఏఎంసీ వైస్ చైర్మన్ రెడ్డి రాజు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు హనుమాన్ చాలీసా పారాయణం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి సిరిసిల్ల రోడ్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో మంగళవారం ఉదయం 8 గంటలకు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని హిందువులు తమ కుటుంబ సభ్యులతో ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని వాసవాంబ సేవా సమితి, పట్టణ ఆర్యవైశ్య సేవా సంఘం తెలిపింది. పారాయణం ప్రతి మంగళవారం నిర్వహించనున్నట్లు ప్రతినిధులు పేర్కొన్నారు.

సొసైటీ భూమిని కాపాడాలని వినతి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్‌లో గల సొసైటీకి సంబంధించిన భూమిని కాపాడాలని ఎంపీటీసీ మహిపాల్ యాదవ్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 1985 నుంచి సొసైటీ ఆధీనంలో ఉన్న 18 గుంటల భూమి ఆక్రమణకు గురైందని దానిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. గతంలో గ్రామానికి చెందిన అలకొండ పెద్ద అంజయ్య, చిన్న అంజయ్యలకు సంబంధించిన భూమిని సొసైటీకి కొనుగోలు చేశారని, అప్పటి నుంచి ఆ భూమి సొసైటీ పరిధిలోనే ఉండేదన్నారు. ప్రస్తుతం ఆ భూమిని విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకొని భూమిని కాపాడాలని కోరారు.


వినతి పత్రం అందజేస్తున్న ఎంపీటీసీ మహిపాల్

ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీతో ఆరోగ్యానికి ముప్పు



భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేసే వ్యర్థాలను నివారించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కాచాపూర్ గ్రామస్తులు చేపట్టిన నిరసన దీక్షలు సోమవారం నాటికి 21వ రోజుకు చేరుకున్నాయి. గ్రామస్తులు దీక్షలో కూర్చుని ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఫ్యాక్టరీ వల్ల మండలంలోని ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ విషయమై చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని అన్నారు. ఫ్యాక్టరీపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు.

గోపాల్‌పేటలో గ్రామసభ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట జీపీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ వంజరి సునీత అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ద్వారా జరిపిన ఆర్థిక లావాదేవీల గురించి, గ్రామంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి గ్రామసభలో చర్చించారు. దీంతోపాటు పల్లెదవాఖానా నిర్మాణం కోసం స్థలాన్ని ఎంపిక చేస్తూ గ్రామసభలో తీర్మానం చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ సునీత మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఏఎన్ఎం లత పాల్గొన్నారు.

ఉపాధి హామీపై సోషల్ ఆడిట్


సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

నిజాంసాగర్(జుక్కల్): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ ప్రజా వేదిక నిర్వహించారు. నాలుగు సంవత్సరాల కాలంలో 1,652 పనులకు గాను రూ. 24.25 కోట్ల విలువైన పనులు కల్పించారు. గ్రామాల వారీగా చేపట్టి ఉపాధి పనులు, కూలీ డబ్బుల చెల్లింపు, మెటీరియల్ పనుల్లో జరిగిన అవకతకవలపై సామాజిక తనిఖీ బృందం ప్రజావేదికలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈజీఎస్ పీడీ సాయన్న, ఎంపీపీ పట్లోళ్ల జ్యోతిదుర్గారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గైని విఠల్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రమేశ్ గౌడ్, వైస్ ఎంపీపీ మనోహర్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గోపాల్‌పేటలో ఎస్ఎస్‌జీ సర్వే


కాలువను పరిశీలిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో ఎంపీవో శ్రీనివాస్‌తో కలిసి ఎస్ఎస్‌జీ సభ్యుడు సత్యనారాయణ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్(ఎస్ఎస్‌జీ) సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామశివారులోని కంపోస్ట్‌షెడ్డులో ఎరువు తయారీ తీరును, అంగన్‌వాడికేంద్రం, ప్రభుత్వ పాఠశాలల్లో గల మరుగుదొడ్లను, గ్రామంలోని మురికి కాలువల నిర్వహణ తీరును పరిశీలించారు. గ్రామంలో ప్రతిఒక్కరూ స్వచ్ఛత పాటించేలా చర్యలు చేపట్టాలని గ్రామపంచాయతీ సిబ్బందికి వారు సూచించారు. గ్రామ సర్పంచ్ వంజరి సునీత, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఐకేపీ సీసీ నారాయణ, వార్డు సభ్యులు ఉన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేట స్కూల్‌తండా పరిధిలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయి. రూ. కోటి 65 లక్షలతో పనులను ఎంపీపీ దశరథ్ రెడ్డి సోమవారం, గ్రామ సర్పంచ లలిత, ఎంపీటీసీ సంత్యాలి, మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు రాజాగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. నాణ్యతతో పనులు చేయాలని కాంట్రాక్టరుకు ఎంపీపీ సూచించారు. బట్టు తండా సర్పంచ్ రెడ్డి రాతుల నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్, ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సబ్బని కృష్ణహరి, ఈవో శ్రీధర్‌రావు, డైరెక్టర్లు అన్నారం నరేష్‌రెడ్డి, భారతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె


కామారెడ్డి రూరల్: డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు


మద్నూర్‌లో ఆందోళన చేస్తున్న వీవోఏలు

సాక్షి నెట్‌వర్క్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీవోఏలు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. సోమవారం 23వ రోజుకి చేరుకుంది. సమ్మెలో భాగంగా సోమవారు స్థానిక అధికారులకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, 3 సంవత్సరాలు వడ్డీలేని రుణాలు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అభయ హస్తం డబ్బులు వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు చోట్ల ర్యాలీలు నిర్వహించారు. తాడ్వాయిలో వీవోఏలతో పాటు మహిళా సంఘాల సభ్యులు కూడా ర్యాలీ నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్ కార్యాలయంలో అందజేశారు.


తాడ్వాయిలో ర్యాలీ నిర్వహిస్తున్న వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు


నాగిరెడ్డిపేట ఎంపీడీవోకు ..

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావాలని బీఆర్ఎస్ గిరిజన రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ నాయక్ సూచించారు. సోమవారం వజ్జపల్లి తండాలో కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ లనిల్, ఎంపీటీసీ రాంచందర్ రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

'అనుమతి లేని కోచింగ్ సెంటర్లపై చర్యలు'

బాన్సువాడ: పట్టణంలో అనుమతి లేకుండా కొనసాగుతున్న కోచింగ్ సెంటర్లపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్ కోరారు. పలుమార్లు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు.